కోణార్క వచ్చి విజయవాడ ప్లాట్‌ఫారం మీద ఆగింది. వసుంధర కొడుకుతో 'సి' కోచ్ వెతుక్కుంటూ ఎక్కింది.

ఆఖరి నిముషంలో టిక్కట్టు కొనడంతో రిజర్వేషన్ దొరకడం కష్టం అయింది. లేడీస్ క్యాబిన్‌లో అసలు ఖాళీలు లేవని మామూలు నెంబరిచ్చారు."ఎక్కాక టి.సి.తో మాట్లాడి ఖాళీ వుంటే ఎడ్జస్టు చేసుకోండి"అని ఉచిత సలహా పారేశాడు.

కంపార్టుమెంటు ఎక్కి లేడీస్ క్యాబిన్ తలుపు తీసి చూసింది. కంపార్టుమెంటంతా కిక్కిరిసి వుంది. ఆరుగురు మనుష్యులు, సామాన్లతో నిండిపోయింది. ఎవరో పంజాబీ కుటుంబం-ఓ ముసలి ఆవిడ, నడివయసు ఆవిడ, పాతికేళ్ల పడుచు, ఒక యువకుడు, యిద్దరు చిన్న పిల్లలు-మొత్తం ఫేమిలీ కింద ఆరు సీట్లూ బుక్ చేసుకున్నారు. 'క్యా హోనా బహన్ జీ' వసుంధరని చూసి యువకుడు పలకరించాడు. 'కుఛ్ నహీ, ఇధర్ కుఛ్ సీట్ ఖాలీ హై క్యా' 'నయి బహన్, హమ్ పూరా రిజర్వేషన్ కర్‌దియా' అన్నాడు. వసుంధర నిరాశగా తన సీటు వెతుక్కుని పెట్టె, బుట్ట, షోల్డరు బ్యాగు అవీ సీటు కిందకి తోసి కూర్చుంది. పదేళ్ల ఆమె కొడుకు కొను క్కున్న కామిక్కులు చదువుతూ చుట్టూ ప్రపంచం మర్చిపోయాడు. ఎదురు సీటులో ఎవరో ముగ్గురు యువకులు. జిడ్డోడుతున్న మొహాలు,




కారా కిల్లీ నమిలే నోళ్ళు, చవకరకం చెమట కంపు కొడుతున్న టెర్లిన్ బట్టలు, రంగురంగుల సాక్సుమీద చవకరకం బూట్లు. చూడగానే చవకరకం వేషాలని పోల్చవచ్చు. వసుంధర ఎక్కిందగ్గర నించి ముగ్గురు ఆడదాని మొహం ఎరగ నట్టు ఆకలి చూపులు చూడసాగారు. వాళ్ల వేషాలు, ఆ వెకిలి నవ్వులు చూసి వసుంధర మొహం చిట్లించి పత్రిక మొహానికి అడ్డు పెట్టుకుంది.' ఛా... యిలాంటి సీటులో పడ్డాను.... యీ వెధవల ముందు ఎంతసేపు కూర్చో వాలో! కూర్చోడం అటుంచి రాత్రి ఎలా పడుకోడం యిక్కడ... వీళ్లెక్కడికి వెడతారో! హాయిగా లేడీస్‌ది దొరికితే గడియపెట్టుకుని పడుకునేది. కండక్టరు వస్తే వీలయితే సీటు మార్చుకోవాలి....'

వసుంధర భువనేశ్వర్‌లో హోమ్‌సైన్స్ డిపార్టుమెంటు హెడ్డు. హైదరాబాద్‌లో 'యూనిసెఫ్' వాళ్లు 'ఫుడ్ అండ్ న్యూట్రేషనల్ వాల్యూస్' మీద సింపోజియం ఏర్పాటు చేస్తే వచ్చి, తిరిగి వచ్చేటపుడు గుంటూరులో తల్లి దగ్గిర ఆదివారం ఆగి, తిరిగి విజయవాడ వచ్చి కోణార్క క్యాచ్ చేసింది. ఈ సింపోజియమ్ ధర్మమా అని వెళ్లేటపుడు ప్లేను ఖర్చు మిగిలింది అని సంతోషించింది. రిటర్న్ జర్నీ తను రైలులో వెడతానంటే;'మీరెలా వెళ్లినా మీ యిష్టం!మా ప్లేను చార్జి యిదిగో'అని యిచ్చేశారు యూనిసెఫ్ వాళ్లు. ఎంత మంచి వాళ్లు!పదిహేనువందలు మిగిలింది. పుస్తకాలకి ఓ గాద్రేజ్ కొనాలనుకుంటోంది. చాలా రోజులయి అది కొనచ్చు యీ డబ్బుతో అని సంతో షించింది వసుంధర. ఆ పదిహేను వందలు, తనది ఐదొందలు రెండువేల క్యాష్—రైలు ప్రయాణంలో నగ లు పెట్టు కోవాలంటే ఆమెకి భయం. అంచేత చేతుల మూడు జతల గాజులు, మెడలో గొలుసు, ఉంగరం దగ్గిరనుంచి అన్నీ తీసి పెట్లో పెట్టింది.' రాత్రంతా యీ పెట్టెకోసం మేలుకోవాలి, హాయిగా ఎప్పుడూ లేడీస్ దాన్లో ఎక్కి తలుపు గడియపెట్టుకుని నిద్రపోయేది. యీసారి యిలా అయింది'అని మరోసారి విసుక్కుంది.

కండక్టరు వచ్చాక ఎక్కడా సీట్లు ఖాళీ లేవన్నది తేల్చాక, ఆ ఎదురుగా కూర్చున్న ముగ్గురూ బరంపురం వరకు వెడతారని విన్నాక, అంటే తెల్లవారే వరకు వీళ్లు తప్పరని అనుకుంటే, రాత్రి వాళ్ల ముందు పడుకోవాలన్నది తల్చుకుంటే వసుంధరకి కంపరంగా వుంది. పోనీ తనకి ఒక్కర్తికి ఆ లేడీస్‌దాన్లో బెర్తిస్తారేమో అడగాలని లేచి వెళ్లింది, కొడుకుని పెట్టె చూడమని. 'ఆయియే, ఆయియే బహన్‌జీ' అంటూ అందరూ ఆప్యాయంగా ఆహ్వానించసాగారు. వాళ్లంతా టీ తాగుతూ వసుంధరకి బలవంతంగా ఓ కప్పు యిచ్చారు. మాటల్లో వాళ్లు, టూరిస్టులని బొంబాయి నించి హైదరాబాదు అక్కడి నించి పూరి, కోణార్క, కలకత్తా, బెనారస్ వగైరాలన్నీ తిరిగి ఢిల్లీ చేరుతారట. ముసలిఆవిడ అత్త, రెండో ఆవిడ చెల్లెలు, చిన్నావిడ కోడలు, అతను కొడుకు, పిల్లలు మనవలు అంతా విషయం రాబట్టింది కబుర్లలో. మాటల్లో తన గోడు చెప్పుకుంది వసుంధర. పెట్టెలో డబ్బు, నగలు వున్నాయి. రాత్రి ఆ వెధవల ముందు కూర్చోవాలంటే నాకు భయంగా వుంది. ఎప్పుడూ యిలా ప్రయాణం చేయలేదు అని చెప్పుకుంది. ఇక్కడ ఒక సీటయినా తనకిస్తారా అని ఆశగా అడిగింది. 'ఆప్ యిదర్ సోని యే బహన్‌జీ, మై వుధర్ జాకే సోవుంగా' అన్నాడు యువకుడు. కొడుకు అది విని మారాం మొదలుపెట్టాడు. తను వచ్చినా ఒక్కడూ అక్కడ పడుకోనన్నాడు. ఒక్కడే కొడుకేమో, ముద్దు ఎక్కువ అయి వాడ్ని విడిచి క్షణం వుండలేదు. పుట్టిందగ్గిర నించి పదేళ్లు వచ్చినా తల్లి పక్కన తప్ప వాడు పడుకోడు. వాడ్ని ఒక్కడ్నీ అక్కడ పడుకోబెట్టి తని క్కడ పడుకోవాలంటే వసుంధరకి ప్రాణం వప్పలేదు. వాళ్లెలాగో 'ఖురదా' వరకు ప్రయాణం చేస్తారు. తెల్లారి 9 గంటలకి ఖురదాలో దిగేవరకు వాళ్లుంటారు కనక పోనీ సామాను వీళ్ల దగ్గి ర పెడితే కనీసం కంటి నిండా నిద్రయినా పోవచ్చు అనుకుంది. పోనీగదా ఒక సీటు యిస్తానంటే యింకోటి కొడుక్కి కూడా యిమ్మని ఎలా అడగడం! అతనొక్కడే మగవాడు, మిగతా వాళ్లు ఆడవాళ్లు, పిల్లలు చిన్నవాళ్లు. యింకెవరు వెడతారు అక్కడికి, సామాను మాత్రం పెడతాను అనుకుంది. 'దానికే భాగ్యం! సామాను మేం చూస్తాం విశ్రాంతిగా వుండండి' అన్నారు వాళ్లు. వసుంధర పెట్టె, బుట్ట అవి తెచ్చి సర్ది పెట్టి విశ్రాంతిగా ఊపిరి పీల్చుకుంది. తరువాత కబుర్లు మొదలుపెట్టి తన విషయాలు చెప్పింది. వాళ్లంతా చాలా అభిమానంగా మాట్లాడారు. రాత్రి డిన్నరు ఆర్డరు చేస్తుంటే వీలులేదని పట్టుపట్టి వాళ్లు తెచ్చుకున్న రొట్టెలు, బంగాళదుంప కూర, స్వీట్లు, పళ్లు అవి పెట్టారు బలవంతంగా. ఎంతయినా నార్త్ యిండియన్స్ ఫ్రెండ్లీగా వుంటారు అనుకుని పొంగిపోయింది. ఉదయం లేచాక మళ్లీ టీ, బ్రెడ్, జామ్, చుడువా అన్నీ పెట్టారు. దిగేలోగా మంచి స్నేహం కల్సిపోయింది, అందరికీ. ఖురదాలో వాళ్లంతా దిగుతూంటే భువనేశ్వర్ వచ్చినపుడు యింటికి రమ్మని మరీమరీ చెప్పి అడ్రసిచ్చింది.

భువనేశ్వర్‌లో దిగి యింటికి వెళ్లి భర్తతో సంతోషంగా తను మిగుల్చుకొచ్చిన డబ్బు, రైల్లో దొరికిన ఫ్రెండ్సు, వాళ్ల మంచితనం, గుంటూరు విశేషాలు అన్నీ చెప్పి, భర్తకోసం కొన్న టెరీకాట్ షర్టు, టై తీసి చూపించాలని పెట్టె తాళం తీసింది. పెట్టెలో నీట్‌గా సర్దినవి సర్దినట్టే వున్నాయి. భర్తకోసం కొన్న షర్టు, టై, తన పట్టుచీరలు రెండు, బంగారు నగలు, రెండు వేలు క్యాష్ తప్ప అన్నీ వున్నాయి. వెర్రి మొహం వసుంధరని చూసి ఏడవలేని నవ్వు నవ్వాడు ఆమె భర్త. 'ఆతిథ్యం ఖరీదు పదిహేను వేలు మాత్రమే, జస్ట్ ఫిఫ్టీన్ థౌజండ్ ఓన్లీ—' అన్నాడు. వసుంధర నోట మాట రాలేదు. ●